క్లుప్తంగా

వరిగడ్డి వాములు దహనం



మాచవరం: మండలంలోని మల్లవోలు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డి వాములు తగలబెట్టిన టన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ చుక్కా సువార్త, ఆమె కుమారుడు రాజారావు పశువులకు మేత నిమిత్తం 8 ఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి వాములు వేశారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాములకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేనుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రక్కనే ఉన్న ఎరువు దిబ్బలు కూడా తగలబడి పోయాయి. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పైకి పశువులను రానివ్వవొద్దు

రైల్వే సీఐ ఆర్‌వీ ఉమారావు



పిడుగురాళ్ల: రైల్వే పట్టాలపై పశువులను రానివ్వొద్దని పిడుగురాళ్ల రైల్వే సీఐ ఆర్‌వీ ఉమారావు కోరారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌కు ఉరువైపులా ఉన్న గ్రామ ప్రజలకు, పిడుగురాళ్ల పట్టణంలోని కాలనీ వాసులకు, పసువుల కాపర్లుకు, పశువుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రైలు వచ్చే సమయంలో పశువులు రైల్వే ట్రాక్‌పై ఉంటే ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా పశువుల యజమానులు, కాపర్లు వాటి మేత కోసం వచ్చే సమయంలో రైల్వే పట్టాల పరిసర ప్రాంతాలలో పశువులు, మేకలు వంటివి రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈసందర్భంగా వారు సూచించారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆదివారం అమావాస్య రావడంతో దోషాల నివారణకు ప్రత్యేకమైన రోజుగా భావించిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దోష నివారణకు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అమ్మవారి ప్రీతికై చండీపారాయణం చేశారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. విశేష పూజాదికాల అనంతరం ప్రధాన ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ

క్రోసూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు మండల కేంద్రమైన క్రోసూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు జరుగు కార్యక్రమాల్లో పుస్తకాలు చదవటం, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జి లాంటి వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు తప్పక సద్వినియోగపరచుకోవాలని ఆమె కోరారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు

నూజెండ్ల: మండల పరిధిలో ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశానికి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యాహక్కు చట్టం ప్రకారం స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు కేటాయించవల్సి ఉందన్నారు. ఇందులో 10 శాతం ఎస్సీ, 4 శాతం ఎస్టీ, హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు 5 శాతం, బలహీన, మైనార్టీ వర్గాలకు 6 శాతం రిజర్వేషను అమలు చేయటం జరుగుతుందన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ, రేషన్‌కార్డ్, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో సమీపంలోని సచివాలయంలోగానీ, మండల విద్యాశాఖా కార్యాలయంలో మే 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని రవిచంద్ర తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- మురుగు కూపాలను తలపిస్తున్న కాలువలు
- రెంటచింతలలో సమస్యలు ఎన్నో..
- చోద్యం చూస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు



రెంటచింతలలో నివాసాల మధ్య చెత్త

రెంటచింతల: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సమస్యలు తిష్టవేస్తున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు పేరుకుపోతోంది. పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇదీ రెంటచింతల దుస్థితి.

పంచాయతీలో పరిస్థితి ఇలా...

మేజర్ పంచాయతీలో సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. పంచాయతీ వార్డులు 18 ఉన్నాయి. ఊరంతా శుభ్రం చేసేందుకు 16 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభా రీత్యా పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పారిశుద్ధ్యంపై అవగాహన కొరవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. తడిచెత్త- పొడిచెత్త సేకరణ ఊసే లేకుండా పోయింది. పారిశుద్ధ్య కార్మికులు తక్కువ మంది ఉండటంతో వారికి పని భారంగా మారడంతో నెలల తరబడి కొన్ని కాలనీలలో చెత్త చెదారం తొలగించలేని పరిస్థితి నెలకొంది. చెత్త సంపద కేంద్రాలు కూడా అలంకారప్రాయంగా మారింది. ఎప్పుడు నిర్మించిన కాలువలు శిథిలావస్థకు చేరాయి. మురుగు కదిలే పరిస్థితి కనిపించడం లేదు.



ప్రధాన రహదారి వెంబడి ఇళ్ల మధ్య అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

మారాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

డ్రెయిన్లు.. మురికి కూపాలులా..

గ్రామంలో డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడు నిర్మించిన కాలువలు శిథిలావస్థకు చేరాయి. మురుగు కదిలే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు, వివిధ కాలనీలలో ఉన్న అంతర్గత రోడ్లకు ఇరువైపుల ఏర్పాటు చేసిన డ్రెయిన్లలో మురుగునీరు పారుదల కావడం లేదు. మురుగు నీరంతా ఇళ్ల పరిసరాలలో నిల్వ ఉండటంతో పాటు రహదారిపై ప్రవహించడంతో తటాకాలను తలపిస్తున్నాయి. సైడ్ కాలువలలోని పూడికలను ఎప్పటికప్పుడు తొలిగించక పోవడంతో పాటు బ్లీచింగ్, ఫాగింగ్ చేయించకపోవడంతో దోమలకు, ఈగలకు నిలయాలుగా మారాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు ఆయా కాలనీవాసులు వాపోతున్నారు.

మురుగునీటి కాలువలు నిర్మించాలి




మోడల్(ఆదర్శ) గ్రామ పంచాయతీగా ఎన్నికైన రెంటచింతల పంచాయతీ బడ్జెట్‌లో 15 శాతం పారిశుద్ధ్యం పనులకు, మరో 20 శాతం మురుగు నీటి కాల్వల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టవచ్చు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే పలు మార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లా. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి గ్రామంలో మెరుగైన వసతుల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎస్. శ్రీనివాసరావు,
కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు

కోతులతో అవస్థలు..

కొన్ని నెలలుగా గ్రామంలో కోతులు గుంపులు గుంపులుగా రాత్రి పగలు తేడా లేకుండా ఇళ్లలోకి వెళ్లి విలువైన వస్తువులను నాశనం చేస్తున్నాయి. ఒక్కొక్క సారి మీదకు దాడి చేయడానికి వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఓ నివాసం ముందు సేదతీరుతున్న కోతులు

గిరిజన హక్కుల కోసం పోరాటం

మాచర్ల: గిరిజన హక్కుల కోసం పోరాటం చేయాలని గిరిజన ప్రజా సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో వైభవ్ ఫంక్షన్ హాలులో గిరిజన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు మాచర్ల నుంచి ఆత్మీయ సమావేశంతో పోరాటానికి పునాది వేశామన్నారు. సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఐటీడీఏ కార్యాలయాలు పేరుకే పరిమితమయ్యాయని చెప్పారు. మైదాన ప్రాంతంలో 30లక్షల మంది గిరిజనులు ఉంటే ఒక్క నియోజక వర్గం గిరిజనులకు ప్రాతినిథ్యం లేదని వాపోయారు. అన్నీ ప్రాంతాలలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర గిరిజన నాయకులు మండ్లి పెద్ద మల్లుస్వామి, నూన్సావత్ రంగానాయక్, అంజినాయక్ మాట్లాడుతూ గిరిజన వాటాల కోసం అడిగే పరిస్థితిలో ఉన్నామన్నారు. ఆత్మీయ సమావేశంలో జిల్లా గిరిజన సంఘ నాయకులు అచ్చమ్మకుంట రవి, ఎంపీటీసీ బ్రహ్మయ్య, ఆర్.బ్రహ్మయ్య నాయక్, సర్పంచులు కేతావత్ శ్రీను, రమావత్ మంత్రునాయక్, ఒంగోలు సైదా నాయక్, కొర్రా అంజినాయక్, బాణావత్ లచ్చు నాయక్, చిన్న శ్రీను నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

పేదలకు వైద్యం అందించటమే లక్ష్యం

జీఎస్‌టీ సెంట్రల్ కమిషనర్ మన్నెం రఘురామిరెడ్డి

పిడుగురాళ్ల: పేదలకు ఉచితంగా వైద్యం అందించటమే మన్నెం అప్పిరెడ్డి చారిట్రబుల్ ట్రస్ట్ లక్ష్యమని జీఎస్‌టీ సెంట్రల్ కమిషనర్ మన్నెం రాఘురామిరెడ్డి అన్నారు. పట్టణంలోని రసూల్ పేటలోని మన్నెం రఘురామిరెడ్డి భవనంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన తల్లిదండ్రులైన మన్నెం అప్పిరెడ్డి, రాజ్యలక్ష్మిల జ్ఞాపకార్థం మన్నెం అప్పిరెడ్డి చారిట్రబుల్ ట్రస్టును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటంతోపాటు ఉచితంగా మందులను అందించటం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో సుమారు 150 మంది పేదలకు సేవలను అందించారు. శిబిరంలో నరసరావుపేటకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గజ్జన బ్రహ్మానందరెడ్డి, పిడుగురాళ్ల పట్టణంలోని అభయ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బుర్రి వెంగళరెడ్డి, ప్రముఖ వైద్యురాలు కనక దుర్గతోపాటు రాఘురామిరెడ్డి భార్య సుస్మీతా రెడ్డి పాల్గొన్నారు.



వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్యులు, మన్నెం రాఘురామిరెడ్డి దంపతులు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరు హాజరు కావాలని కోరారు.

నేడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

మాచర్ల: మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎంపిక ప్రక్రియ సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఉదయం 11గంటలకు వైస్ చైర్మన్ ఎంపిక నిమిత్తం పురపాలక సంఘ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించనున్నారు. కూటమి తరపున దాదాపుగా 18 మందిని క్యాంపులో ఉంచి వైస్ చైర్మన్‌గా షేక్ మదార్‌సాహెబ్‌ను ఎంపిక చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు 31 మందికి గాను అందులో ఇప్పటికి 18 మందిని పార్టీలో చేర్చుకొని కూటమి మున్సిపల్ కౌన్సిల్ నిర్వహిస్తోంది.

పన్నులు చెల్లించండి.. రాయితీలు పొందండి

మాచర్ల: 2024–25వ ఆర్థిక సంవత్సరంలో ఇంటి, ఆస్తి పన్ను ఏప్రిల్ నెలాఖారుకు ఏక మొత్తంగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఇంటి పన్ను, ఖాళీ స్థలం, నీటి పన్నులు బకాయిలున్న వారు ఈ నెల 30వ తేదీలోగా ఏక మొత్తంగా చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట

సత్తెనపల్లి: మండల పరిధిలోని కందులవారిపాలెం గ్రామంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట, పోలేరమ్మ తల్లి కొలుపుల కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట, పోలేరమ్మ తల్లి కొలుపుల కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యుడు కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ బూతుకూరి వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం



కవి కమలారామ్

వినుకొండ: శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో మే 10, 11 తేదీల్లో ఏలూరులో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు, సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, జాషువా సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్ ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా కమలారామ్‌ను పట్టణ ప్రముఖులు, కవులు అభినందించారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి జాతర

బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో ఆదివారం పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయాన్నే గ్రామస్తులంతా అమ్మవారికి జలాభిషేకాలను నిర్వహించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. గ్రామస్తులు అమ్మవారి వసంతోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం కుంకుమ బండ్లను కట్టుకొని అమ్మవారికి పసుపు, కుంకుమ, సారెలను సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి పొంగళ్లను చేసుకుని, మహిళలు బోనాలను ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యాలను చెల్లించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ డి.ప్రవీణ్ బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

నార్నెపాడు(ముప్పాళ్ళ): పోలేరమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పొంగళ్లు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో భాగంగా విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

క్రోసూరు: క్రోసూరు కొండ కింద బజారులోని అంకమ్మతల్లి 27వ వార్షిక మహోత్సవం (తిరునాళ్ల) శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉగ్రదాడులకు పాల్పడిన వారిని

కఠినంగా శిక్షించాలి



వక్ఫ్ చట్టం సవరణ వ్యతిరేకిస్తూ శాంతియుత ర్యాలీ చేస్తున్న ముస్లింలు,

హిందూ, ముస్లిం బాయ్ బాయ్ అంటూ ర్యాలీ

పిడుగురాళ్ల: కశ్మీర్‌లోని పెహల్గాన్‌లో భారతీయులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ... వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుటూ పిడుగురాళ్ల పట్టణంలో ముస్లింలు ఆదివారం శాంతియుత భారీ ర్యాలీని నిర్వహించారు. పిడుగురాళ్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింల భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు మతసమరస్యాన్ని కాపాడాలని, నల్ల చట్టాలను రద్దు చేయాలని, హిందూ, ముస్లిం, సిక్, ఇసాయి బాయి, బాయి అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్తీ మౌలానా మహ్మద్ మాట్లాడుతూ... పెహల్గాంలో జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని, ఉగ్రవాదానికి మతానికి సంబంధం లేదని, ఖురాన్‌లో ఒక మానవుడిని అన్యాయంగా చంపితే సమస్త మానవాళిని చంపినట్లే, ఒక మానవుడిని కాపాడితే సమస్త మానవాళిని కాపాడినట్లు ఉంటుందన్నారు. ఖురాన్ చదివితే వాళ్లు అన్యాయంగా ఒకరి ప్రాణం తీసేవారు కాదని ఈ సందర్భంగా అన్నారు. పబ్లిక్ జమాత్ మర్కస్ అమీర్ జైలాబ్దిన్ మాట్లాడుతూ... ఇది ఏ ఒక్క వర్గం పైనో జరిగిన దాడి కాదని, హిందుస్తాన్‌పై జరిగిన దాడి అని, హిందూ, ముస్లిం ఐక్యంగా ఇటువంటి వాటిని ఎదుర్కొవాలన్నారు. మైనార్టీ నాయకులు అమీర్‌అలీ మాట్లాడుతూ...పెహల్గాన్‌లో జరిగిన దాడిని ప్రతి భారతీయులు ఖండించాలని, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆలేహదీస్ సభ్యులు సానాన్వజ్, బీసీ నాయకులు దూదేకుల ఖాశీం సైదా, జమాత్ ఏ ఇస్లామి హింద్ సభ్యులు కరీం, ముస్లిం యూత్‌వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముజీబ్, ఆరీఫ్ మాట్లాడారు. ర్యాలీలో పబ్లిక్ అమీర్ స్టీల్ ఖాశీం, కౌన్సిలర్‌అబ్దుల్లా, ఖాదర్‌వలి, అబ్దుల్ రజాక్, బాబావలి, పొందుగుల గనీ, జునైద్ భాషా, మున్నా, భాషా, మోటార్ మస్తాన్‌వలి, గోల్డ్ షరీఫ్, షాదుద్దీన్, సయ్యద్ రఫీ, అబ్దుల్ గనీ, జమాల్, జానీ భాషా, ఎండీ సిద్దిక్, సైదావలి, కరిముల్లా, జానిబాబు, నన్నేసా, హుస్సామ్, ఇమ్రాన్, అలీంలు పాల్గొన్నారు.



కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లిం పెద్దలు

అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

అమరావతి: అమరావతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. దాత కబళాయి ఝాన్సీ టోర్నమెంట్‌ను ప్రారంభించి మ్యాచ్‌లో పాల్గొనే అమరావతి గోల్డెన్ ఈగల్స్, దిడుగు అంబేద్కర్ లెవన్ క్రికెట్ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు పులి నాగేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి ప్రీమియర లీగ్ క్రికెట్ పోటీలు వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో బోయపాటి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ప్రథమ బహుమతి రూ.40,000, ద్వితీయ బహుమతి కబళాయి అశోక్‌కుమార్ జ్ఞాపకార్థం రూ.30,000, తృతీయ బహుమతి పులిపాటి లక్ష్మీనరసమ్మ, నరసింహారావుల జాపకార్థం రూ.20,000 అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ కీపర్, బెస్ట్ ఫీల్డర్‌లకు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రేష్టి శ్రీనివాస శర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల అభిషేకాలు, పలు పూజా కార్యక్రమాలను జరిపించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరనాలతో అలంకరించారు. ఆలయ పర్యవేక్షకులు పల్లెర్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరునాళ్ల వద్ద మహా అన్నదానం

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల సందర్భంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రత్యేకంగా పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారుగా 15వేల మందికిపైగా భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల ముగిసేంత వరకు అన్నదాన కార్యక్రమం ప్రతి రోజు మధ్యాహ్నం జరుగుతుందని కమిటీ సభ్యులు చెప్పారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

గురజాల రూరల్: మండల పరిధిలోని చర్లగుడిపాడులోని పోలేరమ్మ తల్లి ఆలయ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆంజనేయస్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక యాదవరాజుల బజారులోని సువర్చలా సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం విజయకుమార్ ఆధ్వర్యంలో స్వామికి ప్రాతఃకాల సమయం నుంచి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, సహస్రనామార్చన జరిపించారు. మధ్యాహ్నం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పేర్ల ముత్తయ్య నేతృత్వంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదానం చేపట్టారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

బీసీ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లోని ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో శనివారం దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు సత్తెనపల్లి రూరల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిటికీలకు మెష్‌లు ఉపయోగించుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, శివుడు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

